GV MALL®
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 117 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 02 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# జగన్ అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలు అందించండి: సుప్రీంకోర్టు

**జగన్ అక్రమాస్తుల కేసులు పూర్తి వివరాలు అందించాలని సీబీఐ, ఈడీలను సుప్రీంకోర్టు ఆదేశించింది.**



**ఢిల్లీ, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్):** జగన్ అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలు అందించాలని సీబీఐ, ఈడీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసుల పూర్తి వివరాలు 2 వారాల్లోగా అందించాలని పేర్కొంది. కింది కోర్టులో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్ల వివరాలు ఇవ్వాలని ధర్మాసనం చెప్పింది. తెలంగాణ హైకోర్టులో ఉన్న పెండింగ్ అప్లికేషన్ల వివరాలు అందించాలని సూచించింది. సీబీఐ, ఈడీ కేసుల వివరాలు విడివిడిగా చార్ట్ రూపంలో అందించాలంది. అన్ని వివరాలతో అఫిడవిట్లు రెండు వారాల్లో దాఖలు చేయాలని ఆదేశించింది.జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ఆలస్యమవుతోందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు గతంలో పిటిషన్ వేశారు. కేసు విచారణ మరో రాష్ట్రానికి బదిలీ చేయాలన్నారు. దీనిపై విచారణను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం చేపట్టింది. వాదనల సందర్భంగా.. రోజువారీ పద్ధతిలో విచారణకు ఇప్పటికే తెలంగాణ హైకోర్టు ఆదేశించినట్లు ఇరుపక్షాల న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ ఇన్నేళ్లపాటు ఎందుకు ఆలస్యమవుతోందని ధర్మాసనం ప్రశ్నించింది. డిశ్చార్జ్, వాయిదా పిటిషన్లు, ఉన్నత కోర్టుల్లో విచారణ పెండింగే కారణమని న్యాయవాదులు చెప్పారు. పెండింగ్లో ఉన్న కేసుల వివరాలిస్తే తగిన ఆదేశాలు ఇస్తామని ధర్మానం చెప్పింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలు, ట్రయల్ కోర్టు, పెండింగ్ కేసుల వివరాలు ఇవ్వాలని ఆదేశించింది.తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

# పార్లమెంట్ లో 'సబర్మతి రిపోర్ట్'ను వీక్షించనున్న ప్రధాని మోదీ

**ఇటీవల విడుదలైన 'సబర్మతి రిపోర్ట్ సినిమాను పార్లమెంట్లో ప్రధాని మోదీ వీక్షించనున్నారు.**



**డిసెంబర్ 30, (రిపబ్లిక్ న్యూస్):** గుజరాత్ అల్లర్లు, గోద్రా రైలు దహనకాండను ఆధారంగా చేసుకొని తెరకెక్కిన 'ది సబర్మతి రిపోర్ట్' (%ష్త్రవ% ను పార్లమెంట్ ప్రాంగణంలో ప్రధాని నరేంద్రమోదీ వీక్షించనున్నారు. సోమవారం సాయంత్రం బాలయోగి ఆడిటోరియంలో ఇతర నేతలతో కలిసి ఈ చిత్రాన్ని చూడనున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.2002లో గుజరాత్లో జరిగిన అల్లర్లు, గోద్రా రైలు దహనకాండ దేశాన్ని కలచివేసిన విషయం తెలిసిందే. ఆ ఏడాది ఫిబ్రవరి 27న పంచమహల్ జిల్లాలోని గోద్రా పట్టణంలో సబర్మతి ఎక్స్ప్రెస్కు కొందరు దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో 59 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. దీనిని ఆధారంగా చేసుకొని బాలీవుడ్ దర్శకుడు ధీరజ్ సర్నా 'ది సబర్మతి రిపోర్ట్' సినిమాను తెరకెక్కించారు. విక్రాంత్ మాస్సే, రాశీఖన్నా ప్రధాన పాత్రల్లో నటించారు. రిధి డోగ్రా కీలకపాత్ర పోషించారు. నవంబర్ 15న ఇది విడుదలైంది.ఈనేపథ్యంలో దీనిని ఉద్దేశించి ఒక నెటిజన్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టాడు. ప్రతిఒక్కరూ ఈ చిత్రాన్ని తప్పక చూడాలని పేర్కొన్నాడు. సున్నితమైన అంశాన్ని దర్శకుడు చాలా చక్కగా చూపించారన్నాడు. ఒక నాయకుడి గొప్పతనానికి భంగం కలిగించేవిధంగా కొంతమంది వ్యక్తులు కావాలని దీనిని ఆ రోజుల్లో రాజకీయం చేశారని పేర్కొన్నాడు.ఆ పోస్టుపై ఇటీవల మోదీ స్పందించారు. "కల్పిత కథనాలు పరిమితకాలమే కొనసాగుతాయి. సామాన్యులకు కూడా అర్థమయ్యేరీతిలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నందుకు సంతోషంగా ఉంది" అని పేర్కొన్న ఆయన ఈ సినిమా పై ప్రశంసలు కురిపించారు.

# సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ

**ఏపీ సీఎం చంద్రబాబు తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు.**



**అమరావతి, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబు తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో వీరిద్దరి సమావేశం జరిగింది. కాకినాడలోని బియ్యం అక్రమ రవాణాపై వారు చర్చించనున్నారు. తాజా రాజకీయ పరిణామాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపైనా సమాలోచనలు చేయనున్నారు. మరోవైపు తన ఢిల్లీ పర్యటన విశేషాలను చంద్రబాబుకు పవన్ వివరించనున్నారు. సోషల్ మీడియా కేసులు, నామినేటెడ్ పదవుల అంశం వీరి మధ్య చర్చకు వచ్చే అవకాశం ఉంది.

# బియ్యం దొంగలెవరు? .. ఇదో జాతీయస్థాయి కుంభకోణం:షర్మిల

**రేషన్ బియ్యం అక్రమంగా విదేశాలకు తరలింపు వెనుక పెద్ద మాఫియా ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**



**విజయవాడ, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్):** రేషన్ బియ్యం అక్రమంగా విదేశాలకు తరలింపు వెనుక పెద్ద మాఫియా ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఇదో జాతీయస్థాయి కుంభకోణమన్నారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. "పేదల పొట్టకొట్టి రూ.48 వేల కోట్ల ప్రజల డబ్బును పందికొక్కుల్లా తిని దోపిడీకి పాల్పడ్డారు. తిలా పాపం.. తలా పిడికెడు అన్నట్లు.. రేషన్ బియ్యం స్మగ్లింగ్ వెనుక ప్రజా ప్రతినిధుల ప్రమేయముంది. ఈ వ్యవహారంలో కింది నుంచి ఉన్నత స్థాయి వరకు కొంతమంది అవినీతి అధికారుల పాత్ర ఉంది. ఎవరికి దక్కాల్సిన వాటా వాళ్లకు చేరుతుండటంతో నిఘా వ్యవస్థ పూర్తిగా కళ్లు మూసుకుంది. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలోని పోర్టుల నుంచి 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరిగిందంటే.. మన చెక్ పోస్టుల పని తీరు ఎలా ఉందో అంచనా వేయొచ్చు.. ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని అక్రమంగా పోర్టు దాకా ఎలా చేర్చారు? మూడేళ్లలో 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యాన్ని ఎలా సేకరించారు? దీని వెనకున్న దొంగలెవరు? రూ.48 వేల కోట్లు ఎవరెవరు తిన్నారు ? అప్పటి ప్రభుత్వ పెద్దలకు బియ్యం మాఫియాతో సంబంధాలు ఉన్నాయా ? తీగ లాగితే వెనకున్న డొంక ఎక్కడ ? మిల్లర్ల చేతివాటం ఉందా? రేషన్ డీలర్ల మాయాజాలమా? అనునిత్యం తనిఖీల సంగతేంటి? పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కమిటీ వేయాలి. అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో విచారణ జరిపించాలి. ప్రపంచానికి అన్నం పెట్టే మన రాష్ట్రాన్ని రేషన్ బియ్యం మాఫియాకు అడ్డాగా మార్చారు. ఈ వ్యవహారంలో నిజాలు నిగ్గు తేల్చాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

# సుప్రీంకోర్టులో స్వల్ప అగ్ని ప్రమాదం

**సుప్రీంకోర్టులో సోమవారం స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది.**



**ఢిల్లీ, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్):** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సోమవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కోర్టు నంబరు 11, 12 మధ్య ఉన్న వెయిటింగ్ ఏరియాలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన సుప్రీంకోర్టు సెక్యూరిటీ, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని, ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని సుప్రీంకోర్టు వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటన నేపథ్యంలో 12వ నంబరు గదిలోని బెంచ్ నేటి విచారణలను నిలిపివేసింది.

# రైతుబంధును ఆపింది సీఎం రేవంత్ రెడ్డే: హరీశ్రావు

**గతంలో మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని రేవంత్రెడ్డి అన్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రవు చెప్పారు.**



**హైదరాబాద్, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్):** గతంలో మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని రేవంత్రెడ్డి అన్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రవు చెప్పారు. తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రేవంత్రెడ్డి సీఎం అయ్యాక.. ఉన్న రైతుబంధునే ఇవ్వట్లేదు. రైతు, కౌలు రైతు ఇద్దరు మాట్లాడుకోవాలని సీఎం, మంత్రి అంటున్నారు. రైతుబంధును ఆపింది సీఎం రేవంత్రెడ్డి. రైతుబంధు, బీమా ద్వారా రైతులకు రూ.82 వేల కోట్లు ఇచ్చింది కేసీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలను ఎగ్గొట్టింది.గతంలో ఎస్ఆర్ఎస్ విషయంలో భారాస సర్కారై అసత్య ఆరోపణలు చేశారు. రూ.15 వేల కోట్లు ప్రజల నుంచి కట్టించాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. పేదలపై ప్రేమ ఉంటే ఎల్ఆర్ఎస్ను ఉచితంగా చేయాలి. పరీక్షలు వాయిదా వేయాలని నిరుద్యోగులు అడుగుతుంటే ప్రతిపక్షాల కుట్ర అంటున్నారు. గతంలో భారాస పాలనలో సర్వే చేస్తే ఆరోపణలు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సర్వే ఎలా ఉందో రేవంత్రెడ్డి చెప్పాలి. గతంలో మాట్లాడిన మాటలపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని హరీశ్రావు అన్నారు.

# నటి శోభిత ఆత్మహత్య కేసు .. దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు



**హైదరాబాద్, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్):** కన్నడ సీరియల్ నటి శోభిత ఆత్మహత్య కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ప్రాథమిక దర్యాప్తులో భార్యాభర్తల మధ్య ఎలాంటి విభేదాలు లేవని గుర్తించారు. మానసిక సమస్యలతో ఆత్మహత్య చేసుకుందా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే అంశాలపై దృష్టి సారించారు. శోభిత భర్త సుధీర్రెడ్డితో పాటు ఇంటి చుట్టుపక్కల వాళ్ల స్టేట్మెంట్లను రికార్డు చేశారు. ఆమె ఇంట్లో సూసైడ్ నోట్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో "ఎవ్రీథింగ్ పర్ఫెక్ట్.. చావాలనుకుంటే యూ కెన్ డూ ఇట్' అని రాసి ఉన్నట్లు తెలిపారు.బెంగుళూరు మ్యాట్రిమోనిలో శోభిత ప్రొఫైల్ చూసి సుధీర్ పెళ్లి ప్రపోజల్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. పెళ్లి తర్వాత ఆమె సీరియళ్లలో నటించడం మానేశారు. శోభిత చివరిసారి ఎవరెవరితో మాట్లాడిందనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. కుటుంబ సభ్యులు బెంగళూరుకు తీసుకువెళ్లనున్నారు.

# సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

**వైకాపా సోషల్ మీడియా పూర్వ కన్వీనర్ సజ్జల భార్గవరెడ్డి కి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది.**



**ఢిల్లీ, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా సోషల్ మీడియా పూర్వ కన్వీనర్ సజ్జల భార్గవరెడ్డి కి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన పిటిషన్ ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించలేదు. విజ్ఞప్తులు ఏమైనా ఉంటే హైకోర్టు ముందే చెప్పుకోవాలని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై నమోదైన కేసుల్లో తనపై ఉన్న ఎఫ్ఐఆర్లను కొట్టివేయాలని ఇటీవల భార్గవరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# కోకాకోలా కంపెనీని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్లో రూ.1000 కోట్లతో నిర్మించిన కోకాకోలా కంపెనీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.**



**బండతిమ్మాపూర్, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్ రూ.1000 కోట్లతో నిర్మించిన కోకాకోలా కంపెనీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్లాంట్లో కలియతిరిగారు. కూల్ డ్రింక్ తయారీ వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రేవంత్రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించడం ఇదే తొలిసారి. సీఎం వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, కొండా సురేఖ ఉన్నారు.

# రైలు ఢీకొని పాలిటెక్నిక్ చదువుతున్న గిరిజన విద్యార్థి దుర్మరణం.



నంద్యాల క్రైమ్ డిసెంబర్ 2(రిపబ్లిక్ న్యూస్): నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సతీష్ అనే గిరిజన విద్యార్థి సోమవారం ఉదయం రైలు ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో ప్రథమ సంవత్సరం చదువుతున్న సతీష్ అనే గిరిజన విద్యార్థి స్థానిక బొమ్మల సత్రం సమీపంలోని ఎస్టీ హాస్టల్ నందు ఆశ్రయం పొందుతున్నాడు. అయితే సోమవారం ఉదయం కాల కృత్యాలను తీర్చుకునేందుకు సమీప రైల్వే ట్రాక్ పై వెళ్తుండగా అకస్మాత్తుగా వెనక నుండి వచ్చిన రైలు విద్యార్థిని ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ హాస్టల్ లో విద్యార్థులకు కనీస మౌలిక సదు-పాయాలను కల్పించకపోవడంతో , విద్యార్థులు ఇలా బయటికి వెళ్లి ప్రమాదాలకు గురి అవుతున్నారు. హాస్టల్ నందు అత్యంత దారుణాతి దారుణంగా బాత్రూములు, వంటశాలలు ,నిద్రించే గదులు హాస్టల్ యొక్క చుట్టుపక్కల వాతావరణం వర్ణనాతీతంగా ఉన్న పరిస్థితిని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ కు వివిధ మాధ్యమాల ద్వారా విద్యార్థులు, విద్యార్థి నాయకులు తమ గోడును వెలబుచ్చారు. విద్యార్థులుహాచుట్టుపక్కల సమీప ప్రాంతాలలో కాలకృత్యాలను తీర్చుకొని వెళ్తూ ఇలా ప్రమాదాలకు గురై నిండు ప్రాణాలను కోల్పోతున్నారు. విద్యార్థి యొక్క విలువైన బంగారు భవిష్యత్తు రైలు ఢీకొన్న ప్రమాదంలో ముగియడం ఎంతో విషాదకరం. దీనికంతటికీ కారణం ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు వారి వసతి గృహాల్లో సరియైన సదుపాయాలు కల్పించకపోవడమేనని విద్యార్థులు విమర్శిస్తున్నారు. ఇటువంటి దుర్ఘటనలు మ-రోసారి పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

# మహిళా కానిస్టేబుల్ దారుణ హత్య .. తమ్ముడే చంపేశాడు..!

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో మహిళా కానిస్టేబుల్ హత్యకు గురయ్యారు.





ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్యకు గురయ్యారు. రాయపోలు నుంచి ఎండ్లగూడ వెళ్లే రహదారిపై ఈఘటన చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నాగమణి హయత్నగర్ పోలీసు స్టేషన్లో పని చేస్తున్నారు. గతంలో ఆమెకు వివాహం జరిగింది. పది నెలల క్రితం భర్తతో విడాకులు తీసుకున్నారు. నెల రోజుల క్రితం మరో వ్యక్తిని కులాంతర వివాహం చేసుకున్నారు. ఇది చూసి తట్టుకోలేని ఆమె సోదరుడు.. విధులకు వెళ్తుండగా నాగమణిని కారుతో ఢీకొట్టి వేట కొడవలితో దాడి చేసి హతమార్చాడు. మృతురాలి స్వస్థలం రాయపోలుగా పోలీసులు గుర్తించారు.మహిళా కానిస్టేబుల్ నాగమణి, శ్రీకాంత్ నవంబర్ 1న యాదగిరి గుట్టలో ప్రేమ వివాహం చేసుకున్నారని సీఐ తెలిపారు. వీరిది రాయపోలు కాగా.. వివాహ అనంతరం హయత్నగర్ నివాసం ఉంటున్నారని చెప్పారు. ఆదివారం సెలవు కావడంతో దంపతులు సొంత గ్రామానికి వెళ్లారని తెలిపారు. నాగమణిని వెంటపడి కారుతో ఢీకొట్టి.. కొడవలితో హత్య చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు.

# సర్వీస్ రివాల్వర్ తో కాల్చుకుని .. వాజేడు ఎస్సై ఆత్మహత్య

ములుగు జిల్లా వాజేడు ఎస్సై హరీశ్ ఆత్మహత్య చేసుకున్నారు. తుపాకీతో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.



వాజేడు: డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్): ములుగు జిల్లా వాజేడు ఎస్సై హరీశ్ ఆత్మహత్య చేసుకున్నారు. ముళ్లకట్ట సమీపంలోని రిసార్ట్లో సర్వీస్ రివాల్వర్తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. వ్యక్తిగత కారణాలతో హరీశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భద్రాద్రి రామాయంలో భక్తులు రద్ది

భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తులు పోటెత్తారు.



భద్రాచలం, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్): భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శనానికి రావడంతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. ప్రసాదాల కౌంటర్ల వద్ద బారులుదీరారు. స్వామివారికి ఈరోజు ముత్యాలతో పొదిగిన వస్త్రాలను అలంకరించారు. దీన్ని ముత్తంగి అలంకారం అని పిలుస్తారు. ఈ రూపంలోని సీతారామ లక్ష్మణులను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# స్థానికులకు శ్రీవారి దర్శనం

## .. టోకెన్ల జారీని ప్రారంభించిన తితిదే ఛైర్మన్

స్థానికులకు తిరుమల శ్రీవారి దర్శన టోకెన్ల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. తిరుపతిలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు దీన్ని ప్రారంభించారు.



తిరుమల, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్): స్థానికులకు తిరుమల శ్రీవారి దర్శన టోకెన్ల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. తిరుపతిలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు దీన్ని ప్రారంభించారు. నగరంలోని మహతి ఆడిటోరియంలో ఈవో శ్యామలరావుతో కలిసి స్థానికులకు టోకెన్లను అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. నవంబర్ 18న జరిగిన తితిదే బోర్డు తొలి సమావేశంలో ప్రతి నెల మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.తితిదే ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. స్థానికుల కోసం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 7 కౌంటర్లు, తిరుమల బాలాజీ నగర్లోని కమ్యూనిటీ హాల్లో 3 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తిరుపతిలో 2,500, తిరుమలలో 500 టోకెన్లు జారీ చేసా-మన్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డుతో తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, తిరుమల నివాసితులకు టోకెన్లు జారీ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి నెల మొదటి ఆదివారం రెండు కేంద్రాల్లోనూ దర్శన టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలియజేశారు. స్థానిక భక్తులు ఒకసారి శ్రీవారిని దర్శనం చేసుకున్న 90 రోజుల తర్వాత మాత్రమే తదుపరి దర్శనానికి అర్హులు. భక్తులు సులువుగా టోకెన్లు పొందేందుకు వీలుగా క్యూలైన్లు, టోకెన్ల జారీకి అన్ని ఏర్పాట్లను తితిదే పూర్తి చేసింది. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

# విండ్ ఫాల్ ట్యాక్స్ రద్దు .. రిలయన్స్, ఓఎన్జీసీకి భారీ ఊరట

ముడిచమురు ఎగుమతులపై విధిస్తున్న విండ్ఫల్ ట్యాక్స్ను కేంద్రం రద్దు చేసింది. దీంతో రిలయన్స్, ఓఎన్జీసీ కంపెనీలకు భారీ ఊరట లభించినట్లయ్యింది.



ఢిల్లీ, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్): దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న ముడి చమురుపై విధిస్తున్న విండ్ఫాల్ ట్యాక్స్ను రద్దు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుంది. దీనిపై గత కొంతకాలంగా కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. ఎట్టకేలకు తన నిర్ణయాన్ని ప్రకటించింది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేంద్రం తాజా నిర్ణయంతో రిలయ-న్స్, ఓఎన్ జీసీలకు భారీ ఊరట లభించినట్లయయింది. దీంతో ఆయా కంపెనీల రిఫైనింగ్ మార్జిన్లు పెరగనున్నాయి.పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్), క్రూడ్ ఉత్పత్తుల ఎగుమతులపై 2022 జులై 1 నుంచి కేంద్రం విండ్ఫాల్ ట్యాక్స్ విధిస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగిన నేపథ్యంలో ఆయా కంపెనీలకు పెద్దఎత్తున లాభాలు వస్తుండడంపై విధించే పన్నునే విండ్ఫాల్ ట్యాక్గా పేర్కొంటారు. రెండు వారాల సగటు చమురు ధరల ఆధారంగా ప్రతి 15 రోజులకోసారి ప్రభుత్వం ఈ పన్ను రేట్లను సవరిస్తూ వచ్చింది.అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర గత కొన్ని నెలలుగా 72–75 డాలర్ల మధ్య చలిస్తోంది. ఈ నేపథ్యంలో విండ్ఫాల్ ట్యాక్స్ రద్దు చేయాలని కేంద్రం నిర్ణయానికొచ్చింది. దీంతో పాటు పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై ప్రభుత్వం విధిస్తున్న రోడ్డు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ సెస్సును కూడా రద్దు చేసింది. విండ్ఫాల్ రద్దు వార్తల నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.30 శాతం లాభంతో రూ.1309 వద్ద ట్రేడవుతోంది.

# ట్రాఫిక్ నియంత్రణకు అంబాసిడర్లు: విజయవాడ సీపీ

ట్రాఫిక్ సమస్యల్ని పరిష్కరించేందుకు ట్రాఫిక్ అంబాసిడర్లను ఏర్పాటు చేయనున్నట్లు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ సి. రాజశేఖర్ బాబు తెలిపారు.



విజయవాడ, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్): ట్రాఫిక్ సమస్యల్ని పరిష్కరించేందుకు ట్రాఫిక్ అంబాసిడర్లను ఏర్పాటు చేయనున్నట్లు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ సి. రాజశేఖర్ బాబు తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ను పటిష్ఠపరచడంతోపాటు ట్రాఫిక్ లో విప్లవాత్మక మార్పులను చేయబోతున్నామన్నారు. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ కాగానే వెంటనే వాట్సప్ గ్రూపులో ఫొటోలు అప్లోడ్ చేయాలన్నారు. “అక్టోబర్ నుంచి నవంబరు ట్రాఫిక్ అంతరాయాలను తగ్గించగలిగాం. అస్త్రం యాప్లో రియల్ టైం డేటా సేకరించి ప్రజలకు సేవలందిస్తున్నాం. ట్రాఫిక్ రద్దీ తగ్గాలంటే టెక్నాలజీ వినియోగించాలి. ట్రాఫిక్ అంతరాయం ఎక్కడ ఉంటుందో డ్రోన్ అక్కడ ఉంటుంది. ట్రాఫిక్ను పసిగట్టి వెంటనే సమాచారం చేరవేస్తుంది. అనేక సందర్భాల్లో ఫిజికల్ పోలీసింగ్ అందుబాటులో ఉండకపోవచ్చు. అన్హైన్స్ ఇన్సిడెంట్స్ను గుర్తించడమే ఈ యాప్ పని. పోలీసులు ఈ యాప్ని ఉపయోగించి త్వరగా స్పందిస్తున్నారు” అన్నారు.“కంట్రోల్ రూమ్ నుంచే జంక్షన్ కానిస్టేబుల్కు సూచనలందిస్తున్నాం. రెడ్ ఎఫ్ఎం ద్వారా ట్రాఫిక్పై మెసేజ్ లను ఇస్తున్నాం. త్వరలోనే ఐదు జంక్షన్లలో ఎస్ఈడీ బోర్డులను ఏర్పాటు చేయబోతున్నాం. కొన్ని డ్రోన్లను వెస్ట్ బైపాస్కి, రామవరప్పాడు రింగు రోడ్ వరకు ఏర్పాటు చేస్తాం. రేపు మధ్యాహ్నం ట్రాఫిక్ ఎలా ఉండబోతుందనేది అస్త్రం అనే ఏఐ టూల్ ద్వారా తెలుసుకుంటాం. డిసెంబర్లో ఇంకొంచెం మెరుగుపడేలా మార్పులు చేశాం. డీసీపీ గౌతమి బెంగళూ-రులోని ట్రాఫిక్ నిబంధనల గురించి చెప్పినప్పుడు ఇక్కడ కూడా కఠినంగా అమలు చేయాలని ఆలోచించాం. ఓ ఫీడ్బ్యాక్ మెకానిజంలా అస్త్రం యాప్ ఉపయోగపడుతుంది” అని సీపీ వివరించారు.

# ఏటూరునాగారం ఎన్ కౌంటర్ పై

## హైకోర్టులో లంచ్ మోషన్ పిటషన్

ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగిన ఎన్కౌంటర్పై తెలంగాణ హైకోర్టులో పౌరహక్కుల సంఘం లంచ్ మోషన్ పిటిషన్ ను దాఖలు చేసింది.



హైదరాబాద్, డిసెంబర్ 2(రిపబ్లిక్ న్యూస్): ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగిన ఎన్కౌంటర్పై తెలంగాణ హైకోర్టులో పౌరహక్కుల సంఘం లంచ్ మోషన్ పిటిషనన్ను దాఖలు చేసింది. మావోయిస్టుల భోజనంలో విషప్రయోగం జరిగిందని అందులో పేర్కొంది. దీనిపై హైకోర్టు మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణ చేపట్టనుంది. మృతదేహాలకు వైద్య నిపుణుల సమక్షంలో పోస్టుమార్టం జరగాలని పిటిషన్లో పేర్కొన్నారు. పోస్టుమార్టం సమయంలో వీడియో రికార్డ్ చేయాలన్నారు. ఆదివారం ములుగు జిల్లా ఏటూరు నాగారంలో అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలకు ఏటూరునాగారం ఆసుపత్రిలో శవపరీక్షలు చేయనున్నారు. వరంగల్ నుంచి వచ్చిన 13 మంది వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో శవపరీక్షలు జరగనున్నాయి. దీంతో ఆసుపత్రి పరిసరాల్లో పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశారు.

# రాష్ట్ర విభజన అంశాలపై ఏపీలో తొలిసారి అధికారుల కీలక భేటీ

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని విభజన అంశాలపై చర్చించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారుల కమిటీ భేటీ అయింది.




అమరావతి, డిసెంబర్ 2(రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని విభజన అంశాలపై చర్చించేందుకు తెలుగురాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారుల కమిటీ భేటీ అయింది. ఏపీలో తొలిసారి జరుగుతున్న ఈ భేటీలో ఇరు రాష్ట్రాల సీఎస్ల నేతృత్వంలో అధికారుల కమిటీ సమావేశమైంది. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్ సంస్థల ఆస్తుల పంపకాలపై ప్రధానంగా చర్చించనున్నారు. విద్యుత్ బకాయిలు, ఉమ్మడి సంస్థల ఖర్చులను తిరిగి చెల్లించే అంశంతో పాటు విభజన పూర్తికాని సంస్థలకు చెందిన నగదు నిల్వలపైనా చర్చించనున్నారు. పంపకం కాకుండా మిగిలిపోయిన రూ.8వేల కోట్ల అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఈ ఏడాది జులై 5న తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి హైదరాబాద్లోని ప్రజా భవన్ వేదికగా భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ భేటీకి కొనసాగింపుగా ఇరు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు సమావేశ-మయ్యారు. ఈ కీలక భేటీలో ఏపీ నుంచి సీఎస్, ఆర్థిక శాఖ కార్యదర్శి, హెూంశాఖ కార్యదర్శి, ఎక్సైజ్శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్కో సీఎండీ, వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ హాజరు కాగా.. తెలంగాణ నుంచి సీఎస్, ఆర్థిక, హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.

# భారాస సినిమాకు శుభం కార్డు పడిపోయింది : ఆది శ్రీనివాస్

బతుకమ్మ చీరల పేరిట గత ప్రభుత్వం నేతన్నల జీవితాలను ఆగం చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు.



హైదరాబాద్, డిసెంబర్ 02 , (రిపబ్లిక్ న్యూస్): బతుకమ్మ చీరల పేరిట గత ప్రభుత్వం నేతన్నల జీవితాలను ఆగం చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సూరత్ నుంచి తెచ్చి బతుకమ్మ చీరలు ఇచ్చారని ఆరోపించారు. అవి పంట చేలలో బెదురు పెట్టేందుకు ఉపయోగపడ్డాయి తప్ప.. ధరించేందుకు పనికిరాలేదని మండిపడ్డారు. క్యాబినెట్లో మహిళకు స్థానం కల్పించని చరిత్ర భారాస సర్కారుదని విమర్శించారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. “బతుకమ్మ చీరలను అసలు మహిళలు కట్టుకున్నారా? ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని పాలన భారాస సర్కారుది. గ్రూప్ వన్ పేపర్లను లీక్ చేసిన చరిత్ర గత ప్రభుత్వానిది. భారాస సినిమాకు శుభం కార్డు పడిపోయింది. సమగ్ర సర్వే చేయించి ఆ నివేదికలను అటకెక్కించారు. బీసీలకు భారాస అనుకూలమా? కాదా? తేల్చి చెప్పాలి. జనాభా దామాషా పద్ధతిలో అన్ని వర్గాలకు ఫలితాలు దక్కాల్సిందే. హైదరాబాద్ను కాపాడాలనే ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకొచ్చాం. దానికి కూడా తూట్లు పొడిచేందుకు ప్రయత్నిస్తున్నారు” అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# సిల్క్ స్మిత బయోపిక్

## .. గ్లింప్స్ విడుదల చేసిన టీమ్

**సిల్క్ స్మిత బయోపిక్ గ్లింప్స్ ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో సిల్క్ స్మిత పాత్రలో చంద్రికా రవి కనిపించనున్నారు.**




అలనాటి నటి సిల్క్ స్మిత జీవితం ఆధారంగా రానున్న చిత్రం 'సిల్క్ స్మిత - ది క్వీన్ ఆఫ్ సౌత్' ఈ బయోపిక్కు అధికారికంగా ప్రకటిస్తూ చిత్రబృందం గ్లింప్స్ను విడుదల చేసింది. ఇందులో సిల్క్ స్మిత పాత్రలో చంద్రికా రవి కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని జయరామ్ అనే నూతన దర్శకుడు తీర్చిదిద్దుతున్నారు. తెలుగులో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో ఒకేసారి ఇది విడుదల కానుంది. ఈ వీడియో చూశారా: "పుష్ప 2' పీలింగ్స్ లిరికల్ వీడియో.. అల్లు అర్జున్- రష్మిక డ్యాన్స్ అదుర్స్

రిపబ్లిక్ సినిమా CINEMA

# పెళ్లి కూతురుగా

## శోభిత ముస్తాబు.. ఫొటోలు వైరల్



నటి శోభితా ధూళిపాళ్ల త్వరలో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టనున్నారు. మరో రెండు రోజుల్లో ఆమె బ్యాచిలర్ జీవితానికి గుడ్ బై చెప్పనున్నారు. నటుడు నాగచైతన్య తో బుధవారం ఆమె వివాహం జరగనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పెళ్లి వేడుకలు ఇరు కుటుంబాల్లో ప్రారంభమయ్యాయి. కాబోయే వధూవరులకు ఇటీవల మంగళ స్నానాలు చేయించారు. ఈనేపథ్యంలోనే ఆమెను సోమవారం పెళ్లికుమార్తెగా ముస్తాబు చేశారు. మంగళ హారతులు ఇచ్చారు. దీనికి సంబంధించిన ఫొటోలను శోభిత తాజాగా నెటిజన్లతో పంచుకున్నారు. ఇందులో ఆమె సంప్రదాయ చీర కట్టులో మెరిసిపోతూ సిగ్గులొలికించారు

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1984 : భోపాల్ విషవాయు దుర్ఘటన సంభవించిన రోజు
- 2004 : అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన రోజు
- 1912 : దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, బి.నాగిరెడ్డి జననం (మ.2004).
- 1937 : మహారాష్ట్ర 15వ ముఖ్యమంత్రి మనోహర్ జోషి జననం.
- 1960 : దక్షిణ భారత చలనచిత్ర నటి సిల్క్ స్మిత జననం (మ.1996).
- 1985 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటయింది.
- 1989 : భారత దేశపు 8వ ప్రధానమంత్రిగా వి.పి.సింగ్ నియమితులైనారు.
- 1996 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి మరణం (జ.1919).
- 1997 : ప్రపంచంలో ఆరు వేల గణితావధానాలు చేసిన ఏకైక వ్యక్తి లక్కోజు సంజీవరాయశర్మ మరణం. (చిత్రంలో)



భోపాల్ విషవాయు



బి.నాగిరెడ్డి


మనోహర్ జోషి


సిల్క్ స్మిత


తెలుగు విశ్వవిద్యాలయం


వి.పి.సింగ్


మర్రి చెన్నారెడ్డి


లక్కోజు సంజీవరాయశర్మ

# ఆల్ టైమ్ టాప్3 లిస్ట్ లోకి 'పుష్ప2'

## .. ప్రీసేల్ బుకింగ్స్ పుష్పరాజ్ హవా

**సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన చిత్రం 'పుష్ప2'. ఈ సినిమా ప్రీ సేల్ బుకింగ్స్ సత్తా చాటుతోంది.**


రిలీజ్ కు ముందునుంచే పుష్పరాజ్ సత్తా చాటుతున్నాడు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'పుష్ప: ది రూల్' డిసెంబర్ 5న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈనేపథ్యంలో తాజాగా దీని ప్రీ సేల్ బుకింగ్స్ ఓపెన్ చేయగా రికార్డు స్థాయిలో టికెట్స్ అమ్ముడవుతున్నాయి. దీంతో ఈ చిత్రం సరికొత్త రికార్డులను తన ఖాతాలో వే-సుకుంటోంది. అల్లు అర్జున్ కు ప్రపంచవ్యాప్తంగా భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. ఓవర్సీస్లో ప్రీ సేల్ బుకింగ్స్ హవా చూపిన ఈ చిత్రం తాజాగా ఉత్తరాదిన కూడా సత్తా చాటుతోంది. హిందీ వెర్షన్ లో టికెట్స్ ఓపెన్ చేసిన వెంటనే హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. 24 గంటల్లో లక్ష టికెట్స్ సేల్ అయ్యాయి. దీంతో బాలీవుడ్లో రికార్డులు సృష్టించిన స్త్రీ, డంకీ యానిమల్ , టైగర్3 సినిమాలను 'పుష్ప2' అధిగమించింది . బాలీవుడ్లో ఆల్ టైమ్ టాప్ చిత్రాల లిస్ట్లో మూడో స్థానంలో నిలిచింది. ప్రీసేల్ బుకింగ్స్లోనే ఈ చిత్రం ఇప్పటివరకు రూ.60కోట్లకు పైగా వసూలుచేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో 'ఆర్ఆర్ఆర్', 'బాహుబలి', 'కేజీఎఫ్2'ల తొలి రోజు వసూళ్లను 'పుష్ప2' దాటేస్తుందని అభిమానులు భావిస్తున్నారు.మరోవైపు విడుదల తేదీ దగ్గర కావడంతో 'పుష్ప2' టీమ్ ప్రచారం జోరు పెంచింది. ఇప్పటికే ముంబయి, కొచ్చిలలో ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించిన టీమ్ నేడు హైదరాబాద్లో భారీఎత్తున ప్రీ రిలీజ్ ఈవెంట్ను నిర్వహించనుంది. ఈ ఈవెంట్ కోసం ఎనిమిది వేల మందికి పాసులు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎవరు హాజరవుతారా అనే దానిపై ఆసక్తి నెలకొంది.




రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# ఆ క్లియరెన్స్ వచ్చిన తర్వాతే ఆస్ట్రేలియాకు షమీ!

**బోర్డర్-గావస్కర్ ట్రోఫీ కోసం సీనియర్ పేసర్ మహ్మద్ షమి ఆస్ట్రేలియాకు వెళ్తాడా? లేదా అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది.**



బోర్డర్-గావస్కర్ ట్రోఫీ కోసం సీనియర్ పేసర్ మహ్మద్ షమీ ఆస్ట్రేలియాకు వెళ్తాడా? లేదా అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. గాయం నుంచి కోలుకున్న షమీ.. భారత జట్టు లో పునరాగమనం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇటీవల రంజీ ట్రోఫీలో బెంగాల్ తరపున ఆడి మధ్యప్రదేశ్పై ఐదు వికెట్లు సాధించి ఫిట్నెస్, ఫామ్ నిరూపించుకున్నాడు. ప్రస్తుతం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బెంగాల్ తరపున ఆడుతున్నాడు. భారత మాజీలు, అభిమానులు షమీని తొందరగా ఆస్ట్రేలియాకు పంపాలని కోరుతున్నారు.ఈ నేపథ్యంలో షమీ గురించి కొత్త అప్డేట్ బయటికొచ్చింది. బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్ డిపార్ట్మెంట్ షమీ ఆసీస్ కు వెళ్తాడా? లేదా అనేది తేలుస్తారు. స్పోర్ట్స్ సైన్స్ డిపార్ట్మెంట్ క్లియరెన్స్ ఇచ్చిన తర్వాతే ఆస్ట్రేలియాకు పంపే అంశాన్ని బీసీసీఐ పరిశీలిస్తుందని సమాచారం. ప్రస్తుతం స్పోర్ట్స్ సైన్స్ డిపార్ట్మెంట్ వర్గాలతోపాటు ఒక నేషనల్ సెలక్టర్ రాజ్కోట్లో ఉంటూ షమీ బౌలింగ్ను దగ్గరి నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఆస్ట్రేలియాలో అతను సుదీర్ఘ స్పెల్స్ వేయగలడా? అతడి ఫిట్నెస్ ఎలా ఉంది అనే అంశాలను పరిశీలించి టీమ్ మేనేజ్మెంట్కు తెలియజేయనున్నారని సమాచారం. స్పోర్ట్స్ సైన్స్ డిపార్ట్మెంట్ నుంచి క్లియరెన్స్ వస్తేనే షమీ ఆసీస్ కు పయనమవుతాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్లో ప్రస్తుతం భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది. రెండో టెస్టు అడిలైడ్ ఓవల్ వేదికగా జరగనుంది. ఈ పింక్ బాల్ (డే/నైట్) డిసెంబరు 6 నుంచి ప్రారంభం కానుంది.

ఆరోగ్యం



# యూరిక్ యాసిడ్ తగ్గాలంటే

## ఉదయాన్నే ఈ గింజల నీరు తాగండి

## .. కీళ్ల నొప్పుల నుంచి రిలీఫ్..

### యూరిక్ యాసిడ్తో ముప్పు..



అధిక యూరిక్ యాసిడ్ స్థాయి ఎవరికైనా ఇబ్బంది కలిగించవచ్చు. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగిన తర్వాత, క్రమంగా ఈ యూరిక్ యాసిడ్ గట్టిపడటం ప్రారంభిస్తుంది. ఈ స్ఫటికాలు (యూరిక్ యాసిడ్ స్ఫటికాలు) చేతి వేళ్లు, కాలి వేళ్లు, వేరే కీళ్లలో పేరుకుపోతాయి. దీంతో.. కీళ్లనొప్పుల సమస్యతో బాధపడతారు. దీంతో రోజు వారీ పనులు చేయడానికి చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. అంతేకాకుండా యూటీఐ లేదా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ బారిన పడే ప్రమాదముంది. దీంతో.. మూత్ర విసర్జన సమయంలో మంట వస్తుంది. ఇంకా నడుము కింద, పొట్ట దిగువ భాగం, గజ్జల్లో తీవ్ర నొప్పి వస్తుంది. అయితే, కొన్ని ఇంటి చిట్కాల ద్వారా యూరిక్ యాసిడ్ కంట్రోల్ చేయవచ్చని ఆయుర్వేదం చెబుతుంది.



### వాము గింజలతో చెక్..



యూరిక్ యాసిడ్ను వాము గింజలతో కంట్రోల్ చేయవచ్చు. వాములో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. దీంతో.. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించవచ్చు. అంతేకాకుండా అన్ హెల్తీ గట్ లక్షణాల్ని తగ్గించే సమ్మేళనాలు వాము గింజల్లో ఉన్నాయి. వీటిని రోజూ తీసుకోవడం వల్ల కీళ్ల చుట్టూ మంట తగ్గుతుంది. కీళ్ల నొప్పులు కూడా తగ్గించవచ్చు. వాము తీసుకోవడం కడుపు సమస్యలు తగ్గుతాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. బరువు తగ్గడంలో వాము గింజలు సాయపడతాయి.

### వాముని ఎలా తీసుకోవాలి..?

యూరిక్ యాసిడ్ తగ్గించడానికి వాము నీరు బెస్ట్



ఆప్షన్. ఇందుకోసం అర లీటర్ నీరు తీసుకోండి. ఇందులో మూడు నుంచి నాలుగు చెంచాలు వాము గింజలు కలపండి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని ఓ రాత్రంతా అలాగే ఉంచండి. మ-రుసటి రోజు ఉదయాన్నే ఈ నీళ్లు తాగండి. దీంతో శరీరంలో యూరిక్ యాసిడ్ లెవల్స్ కంట్రోల్లో ఉంటాయి. చలికాలంలో మీరు కావాలనుకుంటే నీటిలో వాము గింజల్ని మరగించి టీ కూడా తయారు చేసుకోవచ్చు.

### బిర్యానీ ఆకుల్ని ఎలా తీసుకోవాలి..

యూరిక్ యాసిడ్ కంట్రోల్లో ఉండాలంటే.. బిర్యానీ ఆకులతో కషాయం చేసుకోవచ్చు. ఈ కషాయం తాగడం ద్వారా యూరిక్ యాసిడ్ తగ్గుతుందని ఆయుర్వేదం చెబుతుంది. బిర్యానీ ఆకుల కషాయం సిద్ధం చేసుకోవడానికి ముందుగా ఒక కప్పు నీరు తీసుకుని.. రెండు నుంచి మూడు ఆకుల్ని వేసి బాగా మరగించాలి. ఆ తర్వాత కషాయాన్ని వడపోసి.. తాగితే మంచి ఫలితం ఉంటుంది.



### బిర్యానీ ఆకులతో యూరిక్ యాసిడ్ కంట్రోల్..

అధిక యూరిక్ యాసిడ్ మన శరీరంలో పేరుకుపోయినప్పుడు.. యూరిక్ యాసిడ్



స్ఫటికాలు ఏర్పడటం ప్రారంభిస్తాయి. దీనిని హైపర్యూరిసెమియా అంటారు. అనేక అధ్యయనాల ప్రకారం.. యూరిక్ యాసిడ్ అంటే హైపర్యూరిసెమియా రోగులకు బే ఆకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. బిర్యానీ ఆకుల్ని నీటిలో మరిగించి తాగడం ద్వారా యూరిక్ యాసిడ్ స్థాయిల్ని గణనీయంగా తగ్గించుకోవచ్చంటున్నారు ఆయుర్వేద నిపుణులు. బే ఆకుల్లో అనేక ఔషధ గుణాలు కలిగిన ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి యూరిక్ యాసిడ్ ఉత్పత్తి చేసే ఎంజైమ్ అయిన క్శాంథైన్ ఆక్సిడేస్ను నిరోధించగలవు.



### గమనిక..

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.